## మినీకథ

# నీతి! యింతే నీ గతి!




సాయంత్రం నాలుగు గంటలు దాటింది.

యూనివర్శిటీ క్యాంటిన్‌లో మా క్లాస్‌లోని కొంతమంది అబ్బాయిలూ, అమ్మాయిలూ కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు త్రాగుతున్నాం. అది పార్టీ కాదు కానీ.... మా క్లాస్‌లోని ఆనంద్ యూనివర్శిటీ ఎన్నికల్లో డిపార్ట్‌మెంట్ ఛైర్మన్‌గా పోటీ చేయబోతున్నాడు గనుక-మా ఓట్లను సంపాదించడానికి యిలా అప్పుడప్పుడు మమ్మల్ని క్యాంటిన్‌కు తీసుకొచ్చి కాఫీలూ, టిఫిన్లు యిప్పిస్తుంటాడు.

"అన్నట్టు గీతా! మీ ఉమెన్స్ హాస్టల్లో నీ వాచ్‌ని ఎవరో నిన్న కొట్టేశారటగా" రవి అడిగాడు.

"అవును రవీ! ముఖం కడుక్కొని వద్దామని రిస్ట్‌వాచ్‌ను టేబుల్‌మీదపెట్టి బాత్‌రూంకు వెళ్ళాను. అప్పుడు రూంలో మా రూంమేట్స్ ఎవరూ లేరు. నేను ముఖం కడుక్కొని వచ్చేసరికి టేబిల్‌మీద నా వాచ్ కన్పించలేదు. ఎవర్ని అడిగినా మాకు తెలియదన్నారు" చెప్పింది గీత.

"మన హాస్టల్లో దొంగతనాలు మరీ ఎక్కువైపోయాయిలేవే. ఆమధ్య శోభ ఉంగరం పోయిందా - నెల రోజులక్రితం సీతది ఫారిన్ శారీ పోయిందా? నిన్న నీ వాచ్ పోయింది. ఇదంతా మన హాస్టల్లోని పనిమనుషులే చేశారని మనం అనుకోవడం పొరపాటు. మనతోటి అమ్మాయిలే చెక్కేసి ఉంటారు" అన్నాను నేను.

"నువ్వు చెప్పిందీ నిజమే కావచ్చు లతా! మన హాస్టల్లో చాలామంది అమ్మాయిలకు దొంగతనం చేసే అలవాటుందని నా ఫైనలియర్ నోట్‌బుక్ పోయినప్పుడే అనుకొన్నాను" ఉమ అంది.

"ఈ అలవాటు మీ హాస్టల్లోనే కాదండీ మా జెంట్స్ హాస్టల్లో కూడా చాలామంది అబ్బాయిలకు వుంది. బాత్‌రూం దగ్గర సోప్‌గానీ, షేవింగ్ సెట్‌గానీ మరిచిపోయి వచ్చామనుకోండి. అంతే-సంగతులు-దాన్ని ఎవరో కొట్టేస్తారు" గోపి అన్నాడు.

"అయినా—ఈ దొంగతనం అనేదాన్ని మనం క్షమించకూడదు. నన్నడిగితే యింత నీచమైన పని యింకోటి లేదంటాను. మనం యింత చదువులు చదువుకొంటూ యింకా దొంగతనాలు చేసేస్థాయిలోనే వున్నామంటే యింకా దిగజారిపోతున్నామంటే యిక మనం చదువుకొన్న చదువుకు అర్థం ఏమిటి? అవినీతిని, అన్యాయాలను అరికట్టాల్సిన మనం.... వాటిని ప్రోత్సహించడం సహించరాని విషయం. నన్నడిగితే దొంగతనాలు చేసే ప్రతివాడినీ ఉరితియ్యాలి." అంటూ దొంగతనాన్ని అసహ్యంచుకొంటూ ఓ పది నిముషాలపాటు చిన్నసైజు ఉపన్యాసం యిచ్చాడు మా క్లాస్‌మేట్ శ్రీహరి.

"అన్నట్టు చండీదాస్‌గారి 'హిమజ్వాల' నవల ఎక్కడా దొరకడం లేదు. దాన్ని చదవాలని చాలారోజుల నుంచి అనుకొంటున్నాను. మీ దగ్గరుంటే ఎవరైనా యిస్తారా? మళ్ళీ చదివి జాగ్రత్తగా యిచ్చేస్తాను" అన్నాడు శ్రీహరి మా అమ్మాయిల నుద్దేశించి.

"యూనివర్శిటీ లైబ్రరీలో ఒకే కాపీ వుంది. చూడండి" అన్నాను నేను.

మరుసటి రోజు ఉదయం ఎనిమిదిన్నరకు పింగళి లక్ష్మీకాంతంగారి 'సాహిత్య శిల్ప సమీక్ష' పుస్తకం వుందేమో చూద్దామని లైబ్రరీలోకి వెళ్ళి... యినుప బీరువాలలో అమర్చబడిన పుస్తకాలను మెల్లగా చూస్తున్నాను. ఆ 'వింగ్'లో నేనొక్కదాన్ని తప్ప యింకెవరూ లేరు. బీరువాల మధ్యలో నేనుండడం వల్ల ఎవరికీ కన్పించను నేను.

ఎవరో వచ్చినట్లు అలికిడైతే పుస్తకాల మధ్యలోంచే అటు చూశాను నేను. అక్కడ మా క్లాస్‌మేట్ శ్రీహరి .... ఓ బీరువాదగ్గర నిలబడి, ఏదో పుస్తకం వెతికి తీసుకొని, కొంతసేపు అటూ, యిటూ చూసి, మెల్లగా షర్ట్‌ను పైకి లేపి ఆ బుక్‌ను కడుపుదగ్గర ప్యాంట్‌లో చెక్కుకున్నాడు. ఇదంతా గమనిస్తున్న నేను స్థాణువైపోయాను. దొంగతనాన్ని అసహ్యంచుకొని, ప్రతి దొంగను ఉరితీయాలని నిన్న నీతులు చెప్పిన అతడు యిప్పుడు చేసిందేమిటి? దొంగతనం చేసే స్థాయికి తనే దిగజారిపోయాడు!

—వీరపల్లె వీణావాణి